సాక్షి
మహబూబాబాద్

సోమవారం । 19 । మే । 2025



ముగిసిన నెట్‌బాల్ పోటీలు

జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి.

- 8లో ▸



అన్నదానం..మహాప్రసాదం

సరస్వతి నది పుష్కరాలకు వచ్చే భక్తులకు కాళేశ్వరంలోని ముక్తీశ్వరాలయ సమీపంలో అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.8° /24.7°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

మహబూబాబాద్: కలెక్టరేట్‌లో నేడు(సోమవారం) జరిగే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు, రవాణా తదితర కార్యక్రమాల్లో జిల్లా అధికారులు నిమగ్నమై ఉన్నారన్నారు. అధికారులందరూ అందుబాటులో లేకపోవడంతో ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు చెప్పారు. జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి వినతులతో కలెక్టరేట్‌కు రావొద్దన్నారు.

తహసీల్దార్లకు పోస్టింగ్

మహబూబాబాద్: జిల్లాలోని పలు మండలాలకు తహసీల్దార్లను కేటాయిస్తూ కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కురవి తహసీల్దార్‌గా విజయ, సీరోలు పూర్ణచందర్, కేసముద్రం వివేక్, డోర్నకల్ ఇమ్మానీయల్, నర్సింహులపేట రమేశ్‌బాబు, గూడూరు నాగభవాని, నెల్లికుదురు తహసీల్దార్‌గా సీహెచ్.నరేశ్‌ను నియమించారు. అలాగే గూడూరు తహసీల్దార్ చంద్రరాజేశ్వర్‌ను మానుకోటకు, నర్సింహులపేట తహసీల్దార్ నాగరాజు బయ్యారం, డోర్నకల్ తహసీల్దార్ కృష్ణవేణి మరిపెడకు బదిలీ అయ్యారు.

అడవిపంది దాడిలో తునికాకు కూలీకి గాయాలు

కొత్తగూడ: అడవిపంది దాడిలో తునికాకు కూలీకి గాయాలైన సంఘటన మండలంలోని ఈశ్వరగూడెంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంజ వెంకన్న సమీప అటవీ ప్రాంతంలో తునికాకు సేకరించేందుకు వెళ్లాడు. ఈక్రమంలో పొదల మాటున ఉన్న అడవిపంది ఒక్కసారిగా ఆయనపై దాడి చేసింది. ఈఘటనలో వెంకన్న కాలికి తీవ్ర గాయం అయింది. 108 ద్వారా నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేయడంతోపాటు సమయానికి ఆస్పత్రికి తరలించిన 108 సిబ్బందికి వెంకన్న బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు ఆందోళన చెందవద్దు



తొర్రూరు: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వానాకాలం సీజన్ కంటే ప్రస్తుతం అధికంగా ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.30లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని, ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని సేకరిస్తామన్నారు. గాలివానలు, కాంటాలు, గన్నీ సంచులు, రైస్ మిల్లుల ద్వారా వచ్చే సమస్యలపై భయాందోళన చెందవద్దని సూచించారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ డీఎం కృష్ణవేణి, డీపీఆర్‌ఓ రాజేంద్రప్రసాద్, డీటీ నర్సయ్య పాల్గొన్నారు.

పోలీస్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం

మహబూబాబాద్ రూరల్: పోలీస్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రహీం బ్లూకోల్ట్స్ విధుల్లో భాగంగా శనివారం రాత్రి డయల్ 100కు కాల్ వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నాడు. కానిస్టేబుల్ వివరాలు అడుగుతున్న క్రమంలో బూర్గుల అఖిల్ అనే యువకుడు అక్కడకు వచ్చి ఆయన విధులకు ఆటంకం కలిగించాడు. సదరు కానిస్టేబుల్ జరిగిన సంఘటనపై టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై కె.శివ కేసు నమోదు చేశారు.

మేడారంలో భక్తుల సందడి

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీతో మేడారం అమ్మవార్ల గద్దెల ప్రాంగణం కోలాహలంగా మారింది. పరిసర ప్రాంతాలు భక్తులతో సందడిగా కనిపించాయి. భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నాలు ఆచరించారు. అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీరసారె, గాజులు, పూలు, పండ్లు, ఎత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యాటలు, కోళ్లతో మొక్కు సమర్పించారు. అనంతరం భక్తులు మేడారం పరిసరాల్లోని చెట్ల కింద వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. సుమారుగా 20వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచన వేశారు.

కిశోరం.. బలహీనం

- ఎదిగే వయస్సులో బాలికలకు అందని పోషకాలు
- వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు
- ప్రభుత్వం దృష్టి పెట్టకపోతే ఇబ్బందులే..



సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో ఎదిగే పిల్లలకు పోషకాహారం అందడం లేదు. సరైన పోషకాలు అందక నీసరంగా ఉంటూ అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా కిశోర బాలికలు పోషకాలు అందక రకరకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యలతో సతమతం

ఎదిగే వయస్సు పిల్లల్లో శారీరక మార్పులు వస్తాయి. ఈక్రమంలో బాలికలు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారు.మానసిక సమస్యతో పాటు, ఋతుస్రావం మొదులు కావడంతో అధిక రక్తం కావాల్సి ఉంటుంది. అయితే కుటుంబ సమస్యలు, పేదరికం, అవగాహన లేకపోవడంతో కావాల్సిన మొతాదుల్లో పోషకాలు తీసుకోలేకపోతున్నారు. జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్, గూడూరు, మరిపెడ, తొర్రూరు మాతా శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 16,080మంది కిశోర బాలికల పేర్లు నమోదు చేశారు. అదేవిధంగా రాజీవ్ బాలారోగ్యరక్ష ఆధ్వర్యంలో 24,179 మంది బాల, బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకొని 23,889మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 9,450 మంది బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించగా 5,392మంది సాధారణ స్థాయిలో హిమోగ్లోబిన్ ఉండగా, 1,552 మందికి కొద్దిపాటిలోపం, 2,097 మందికి మధ్యస్త లోపం, 200 మందికి ఎక్కువ, 209 మంది బాలికలకు ప్రమాదకర స్థాయిలో రక్తం ఉన్నట్లు గుర్తించి మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేశారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా నమోదైన కిశోర బాలికలు

ప్రాజెక్టు	బాలికలు
డోర్నకల్	3,495
గూడూరు	1,895
మహబూబాబాద్	4,699
మరిపెడ	3,029
తొర్రూరు	2,962

అందని పోషకాహారం..

గిరిజనులు, ఆదివాసీలు అధికంగా ఉన్న జిల్లాలో కిశోర బాలికల గురించి పట్టించుకున్న నాథుడే కరుయ్యాడు. ప్రధానంగా 11 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికల్లో శారీరక, మానసిక ఎదుగుదల వేగంగా ఉంటుంది. దీనికి అనుగుణంగా పోషకాలతో కూడిన ఆహారం అవసరం. కాగా, రెసిడెన్షియల్, కేజీబీవీల్లో చదివే పిల్లలకు కొంత మేరకు ఐరన్, విటమిన్స్, ప్రొటీన్స్, కాల్షియంతోపాటు ఇతర పోషకాలు ఉన్న బెల్లం, పాలు, పల్లీలు, నువ్వులు, మాంసం, గుడ్లు, పండ్లు వంటి ఆహారం కొంత మేరకు అందుతుంది. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికలు, పదో తరగతి వరకు చదివి చదువు మానేసిన వారు, డ్రాపౌట్ పిల్లలకు పోషకాలు అందడం లేదు. కాగా గతంలో అగన్‌వాడీ టీచర్లు, అధికారులు అందించే గైడెన్స్ ఇవ్వడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి.

ఆర్‌బీఎస్కే నిర్వహించిన రక్త పరీక్షల వివరాలు

రక్త పరీక్షలు నిర్వహించిన బాలికల సంఖ్య:	9,450
సాధారణ స్థాయిలో ఉన్న బాలికలు:	5,392
కొద్దిపాటి రక్త హీనత:	1,552
మధ్యస్త రక్త హీనత:	2,097
ప్రమాదకర స్థాయి:	200
అతి ప్రమాదకరం:	209

అవగాహన కల్పిస్తున్నాం..



కిశోర బాలికల్లో వచ్చే మార్పులు, శారీరక, మానసిక ఒత్తిడిని తట్టుకునేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పిస్తున్నాం. పౌష్టికాహారం కిట్ పంపిణీపై ప్రణాళికలు జరుగుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే జిల్లాలో అమలు చేస్తాం.

- ధనమ్మ, డీడబ్ల్యూఓ

రక్తహీనతతో అనేక సమస్యలు



మా వద్దకు వచ్చే టీనేజ్ బాలికల్లో మానసిక ఒత్తిడితో పాటు, రక్తహీనత సమస్యతో బాధపడుతున్న వారే అధికంగా ఉంటున్నారు. ఆడవారికి హిమోగ్లోబిన్ 12 నుండి 13 గ్రాముల వరకు ఉండాలి. కానీ కొందరిలో 6 గ్రాములు, 7 గ్రాములు కూడా ఉండని పరిస్థితి కనిపిస్తుంది. దీంతో ఋతుస్రావం సమస్య తలెత్తుతుంది. జ్వరం, కాళ్లు, చేతులు గుంజడం, నీరసం, ఇతర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడతారు. ఇందుకు ప్రధాన కారణం సమతుల ఆహారం తీసుకోకపోవడమే. మాంసం, చేపలు, గుడ్లు, పాలు, బెల్లం, కర్జురా, అంజీర, పల్లీలు, నువ్వులు, పండ్లు, తాజా కూగాయలు తీసుకోవాలి. లేకపోతే రక్తహీనత వస్తుంది. టీనేజీలో మొదలైన సమస్యలు పెద్దయ్యాక మరింత జఠిలమవుతాయి. అందుకే మంచి ఆహారం తీసుకోవాలి.

- పాల్వాయి సౌజన్య, గైనకాలజిస్టు

పౌష్టికాహారం అందించాలి



ఎదిగే పిల్లలకు కావాల్సిన పౌష్టికాహారం అందించాలి. అయితే ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు మాత్రమే పౌష్టికాహారం అందిస్తున్నారు. టీనేజీ పిల్లలకు కూడా ఐరన్, ప్రొటీన్స్‌తో కూడిన అహారం అందించాలని ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వాన్ని కోరాం. వారు సానుకూలంగా స్పందించారు. ఇందిర అమృతం పేరుతో కిట్ ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఆ ప్రక్రియను వేగవంతం చేయాలి.

- విజయలక్ష్మి, మహిళా సంఘం నాయకురాలు

భక్తజన ప్రవాహం



పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

సరస్వతి నది పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

- తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు రద్దీ
- ఆలయాల్లో దర్శనాలు.. పుష్పగిరి పీఠాధిపతి పూజలు
- సుమారు 1.80లక్షల మంది పుణ్య స్నానాలు

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతి నది పుష్కరాలకు భక్తుల ప్రవాహం పెరిగింది. ఆదివారం సెలవు కావడంతో నాలుగో రోజు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి భక్తులు కాళేశ్వరానికి బారులుదీరారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతినదిలో పుష్కర స్నానాలు ఆచరించి నదీమాతకు చీర, సారె సమర్పించారు. ముత్తయిదువ మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పలువురు పిండ ప్రదాన పూజలు చేశారు. పితృదేవతలకు తర్పనాలు నిర్వహించారు. పుష్కరిని భక్తులతో నిండిపోయింది. స్టాళ్లలో ఏర్పాటుచేసిన ఫుడ్‌కోర్టు, ఖాదీవస్త్రాలు, చిల్డ్రన్స్ ఆటలు, టెంట్‌సిటీలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

1.80లక్షల మంది భక్తుల స్నానాలు..

వివిధ రాష్ట్రాల నుంచి భారీగా ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు సరస్వతినదిలో పుష్కరస్నానాలు ఆచరించారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ఒక్కరోజు 1.80లక్షల మంది భక్తులు పుష్కరస్నానాలు చేసినట్లు అధికారుల అంచనా వేశారు. కలెక్టర్ రాహుల్‌శర్మ భక్తులకు కల్పించిన సౌకర్యాలను సమీక్షించారు.

నదీహారతికి పెరిగిన భక్తులు..

నాలుగు రోజులుగా సరస్వతిఘాట్‌లో కాశీపండితులతో ఏర్పాటు చేసిన నవరత్నమాలిక హారతికి భక్తుల తాకిడి పెరుగుతోంది. ఏడు గద్దెలపై తొమ్మిది హారతులను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విద్యుత్ వెలుగుల్లో హారతి ఇస్తున్నారు.



పుష్కర ఘాట్ వద్ద భక్త జనసందోహం



పుష్కర ఘాట్ వద్ద సరస్వతి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

పుష్పగిరి పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం

పుష్పగిరి పీఠాధిపతి విద్యాభారతిస్వామి సరస్వతినదిలో పుష్కర స్నానాలు చేశారు. నదికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రాజగోపురం వద్దకు రాగా ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకుని అభిషేక పూజలు చేశారు.

సెలవురోజు పెరిగిన రద్దీ..

వీకెండ్ కావడంతో రద్దీ పెరిగింది. హైదరాబాద్, వరంగల్, భూపాలపల్లి మీదుగా, మంథని, కాటారం మీదుగా భారీగా వాహనాలు తరలివచ్చాయి. ట్రాఫిక్ జాం కాకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. కార్లు, ఆర్టీసీ బస్సుల్లో వచ్చిన భక్తులను వీఐపీఘాట్ సమీప, ఇప్పలబోరు, బస్టాండ్ వద్ద పార్కింగ్ ప్రాంతాలకు తరలించారు.

సైన్యానికి మద్దతుగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీ చేస్తున్న మానుకోట యువకులు



మాట్లాడుతున్న మాజీ సైనికుడు సత్యనారాయణ


మహబూబాబాద్ అర్బన్: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం, నెహ్రూసెంటర్, రైల్వేస్టేషన్ మదర్‌థెరిస్సా సెంటర్, చేపల మార్కెట్ మీదుగా స్వామి వివేకానంద సెంటర్ వరకు భారత్ సైన్యానికి మద్దతుగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ చైర్మన్ మార్తినేని ధర్మారావు హాజరై మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలను, ఆర్మీ బేస్‌లను ధ్వంసం చేసిందని కొనియాడారు. ప్రధాని మోదీ వ్యూహంతో వ్యవహరించి పాకిస్తాన్‌లోని టెరర్రిస్టులను భారత్ సైన్యంతో హతం చేశారన్నారు. తిరంగా యాత్రలో పాల్గొన్న జిల్లా మాజీ సైనికులకు, ఆర్మీ, నేవీ సైనికులకు, యువకులు, మహిళలు, వ్యాపారవేత్తలకు, న్యాయవాదులు, వైద్య బృదాలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్మీ, నేవి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. సైన్యం పిలిస్తే భారత్ తరఫున తాము యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నామని, తమ ప్రాణాలను సైతం లెక్కచేయమని చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా మాజీ అధ్యక్షుడు వద్దిరాజు రామచందర్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్యామ్‌సుందర్‌శర్మ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గద్దం అశోక్, రాష్ట్ర ఎస్టీ మోర్చా కార్యదర్శి రాంబాబు నాయక్, జిల్లా అధికార ప్రతినిధి ఇందుభారతి, పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు సంపత్, ఓర్సు పద్మ, సరోజ, రాధపటేల్, మహేష్‌గౌడ్, సందీప్, నరేశ్, మదన్‌లాల్, అశోక్, మాజీ సైనికులు నర్సింహారావు, కేశవరావు, విజయ్‌గణేష్, రాజేశ్వర్, రాఘవరెడ్డి, ఐలయ్య తదితరులు ఉన్నారు.

మొలకెత్తిన ధాన్యం..

మహబూబాబాద్ రూరల్ : అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి మొలకెత్తిన ఘటన మహబూబాబాద్ మండలంలోని సింగారం గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో చోటుచేసుకుంది. వారం రోజుల ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా జరుపుతున్నారు. అలాగే లారీలు రాకపోవడంతో కాంటాలు పెట్టిన ధాన్యం పేరుకుపోయింది. దీంతో ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో ధాన్యం తడిసి మొలకెత్తింది. అధికారుల స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు శ్రీను



సింగారం కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం

బొగత కనువిందు

వాజేడు: మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత జలపాతానికి భారీగా నీరు వచ్చి చేరింది. మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు గుట్టలపై నుంచి వాగు పొంగడంతో జలధారలు దర్శనమిచ్చి కనువిందు చేస్తున్నాయి. మండు వేసవిలో జలపాతం జాలువారడం ఇదే తొలిసారి కావడం విశేషం.



మహిళలకు భరోసా..

- బాధిత స్త్రీలకు అండగా నిలుస్తున్న సఖి కేంద్రం
- నాలుగు నెలల్లో 105 కేసులు నమోదు
- అందుబాటులో 181 వాహనం
- హింస నుంచి రక్షణ కల్పించడమే కేంద్రం ఉద్దేశం



సఖి సేవలపై అవగాహన కల్పిస్తున్న కేంద్రం సిబ్బంది(ఫైల్)



జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రం

మహబూబాబాద్: బాధిత మహిళలకు భరోసా కల్పించడంతో పాటు, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సఖి కేంద్రం సత్ఫలితాలు ఇస్తోంది. కేంద్రం ద్వారా కల్పిస్తున్న సేవలపై సిబ్బంది విస్తృత ప్రచారం చేయడంతో ఎక్కువ కేసులు నమోదు అవుతున్నాయి. ఎక్కువగా గృహ హింస కేసులు నమోదు అవుతున్నాయి. కాగా 181 ఫోన్ నంబర్, వాహనంతో బాధిత మహిళలకు న్యాయం జరుగుతోంది.

జిల్లా కేంద్రంలో..

జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్ రోడ్‌లో సఖి కేంద్రం నిర్వహిస్తున్నారు. సెంటర్‌లో ఒక అడ్మిన్, లీగల్ కౌన్సిలర్, సైకోసోషల్ కౌన్సెలర్, ఇద్దరు కేస్ వర్కర్లు, ఇద్దరు పారా మెడికల్, ఒక ఐటీ, ఇద్దరు మల్టీపర్పస్ వర్కర్లు, ముగ్గురు సెక్యూరిటీ గార్డులు పని చేస్తున్నారు. వీరితో పాటు 181 వాహనం డ్రైవర్ కూడా పని చేస్తున్నారు. సమాజంలోని మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న వివిధ రకాల హింసలు, వేధింపుల నుంచి రక్షణ కల్పించడానికి అవసరమైన అన్ని రకాల సహాయ, సహకరాలు అందించడానికి ప్రభుత్వం సఖి కేంద్రం ఏర్పాటు చేసింది.

ప్రధానంగా అందుతున్న సేవలు..

బాధితులకు కౌన్సెలింగ్, వైద్యం, తాత్కాలిక వసతి, న్యాయం, పోలీసు వంటి సేవలు అందిస్తోంది. ఎక్కువగా గృహహింస, వరకట్న వేధింపులు, పనిచేసే ప్రాంతాల్లో వేధింపులు, ఆడపిల్లల అమ్మకం వంటి కేసులు ఎక్కువగా వస్తున్నాయని సిబ్బంది తెలిపారు. 181 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సలహాలు, కౌన్సెలింగ్, రక్షణ కల్పిస్తున్నారు. అత్యాచార బాధితులు, కిడ్నాప్ అయిన వారికి, రాత్రి సమయంలో వాహనాలు లేక ఇబ్బంది పడుతున్న వారికి రక్షణతో పాటు భోజన వసతి సదుపాయాలు కల్పిస్తున్నారు. బాధిత మహిళలకు పోలీసు సహాయంతో పాటు కోర్టులో మెయింటనెన్స్ కేసు వేయించి ఆ ఖర్చులు కూడా కేంద్రమే భరిస్తోంది.

అవగాహన సదస్సులు..

సఖి కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 32 అవగాహన సదస్సులు నిర్వహించి 8,312 మందికి అవగాహన కల్పించారు. 181 మహిళా హెల్ప్ లైన్‌ద్వారా వచ్చిన 37 ఫోన్ కాల్స్‌కు గాను 15 కేసులు నమోదు చేశారు. ఐదుగురు బాధితులను కాపాడారు. నాలుగు నెలల్లో 52 కేసులకు మెడికల్ సేవలు కూడా చేశారు.

నాలుగు నెలల్లో 105 కేసులు..

సఖి కేంద్రం ద్వారా జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో 105 కేసులు నమోదు చేశారు. వీటిలో 50 గృహ హింస కేసులు, 8 వరకట్న వేధింపుల కేసులు, 3అత్యాచార కేసులు, ఒక పిల్లలపై లైగింక వేధింపులు కేసు, ఒక బాల్యవివాహం కేసు, 9 మిస్సింగ్ కేసులు, 33 ఇతర కేసులు నమోదయ్యాయి. వీటిలో 30 కేసులు పరిష్కారం కాగా.. 75 కేసులు పరిష్కరించాల్సి ఉంది. సైకో సోషల్ కౌన్సెలింగ్ 345 మందికి, లీగల్ కౌన్సెలింగ్ 215 మందికి చేశారు.

ఐదు రోజుల వసతి..

కేంద్రంలో ఐదురోజుల పాటు బాధిత మహిళలు, బాలికలకు వసతి, భోజనం ఇతర అన్ని సదుపాయాలు కల్పిస్తారు. ఈ క్రమంలో బాధితులను కుటుంబ సభ్యులు తీసుకెళ్లకపోతే వరంగల్, ఖమ్మంలోని స్వధార్ హోంకు పంపిస్తారు. అక్కడ ఎన్ని రోజులు అయినా ఉండవచ్చు. అక్కడి స్వయం ఉపాధికి సంబంధించి కుట్టుమిషన్ లాంటివి నేర్పిస్తారు.

సఖి సేవలు భేష్

జిల్లాలో సఖి కేంద్రం నిర్వహణ బాగుంది. సిబ్బంది కూడా సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు. సెంటర్ డీడబ్ల్యూఓ శాఖ పరిధిలోనే కొనసాగుతోంది. తరచూ కేంద్రాన్ని తనిఖీ చేసి పర్యవేక్షిస్తున్నా. కేంద్రం కార్యకపాలు, కేసులు ఇతర అన్ని నివేదికలను కార్యాలయంలో అందజేస్తారు. బాధిత మహిళల రక్షణ కోసమే సెంటర్ నడుస్తోంది.

ధనమ్మ, డీడబ్ల్యూఓ

రేపటి నుంచి పీజీ కోర్సుల పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో పీజీ కోర్సుల నాలుగో సెమిస్టర్(నాన్ ప్రొఫెషనల్)రెగ్యులర్, ఎక్స్,ఇంప్రూవ్‌మెంటు పరీక్షలు ఈనెల 20 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య సౌజన్య ఆదివారం తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఆర్‌ఎం, జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ తదితర కోర్సుల పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 20, 22, 24, 27, 29, 31 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. కేయూ పరిధిలో పీజీ కోర్సుల పరీక్షల నిర్వహణకు 26 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4,300 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

పెరిగిన లిక్కర్ ధరలు

- నెలకు రూ.2.50 కోట్ల మేర భారం



మహబూబాబాద్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం లిక్కర్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో మద్యం ప్రియులపై ఆర్థిక భారం పడనుంది. ప్రభుత్వం క్వార్టర్ సీసాపై రూ.10, హాఫ్ బాటిల్‌పై రూ.20, ఫుల్ బాటిల్ పై రూ.40 పెంచింది. రెండు నెలల క్రితమే బీర్ల ధరలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా లిక్కర్ ధరలు కూడా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కాగా, పెరిగిన ధరలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమలులోకి రానున్నాయి.

నెలకు రూ.2.50 కోట్ల మేర భారం..

ప్రభుత్వం తీసుకున్న లిక్కర్ ధరల పెంపు నిర్ణయం వల్ల జిల్లాలోని మద్యం ప్రియులపై నెలకు రూ.2.50 కోట్ల మేరకు భారం పడనునట్లు అంచనా. జిల్లా పరిధిలో 59 వైన్ షాపులు, 9 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. వాటిలో నెలకు అన్ని రకాల మద్యం బాటిళ్లు 56,700 మేరకు విక్రయం జరుగుతున్నాయి. తద్వారా నెలకు రూ.55 కోట్ల మేరకు ఆదాయం సమకూరుతోంది. కాగా ప్రస్తుతం ప్రభుత్వం పెంచిన ధరలతో నెలకు రూ.2.50 కోట్ల మేరకు మద్యం ప్రియులపై భారం పడుతుందని అంచనా.

క్లుప్తంగా

హామీల అమలులో కేంద్రం విఫలం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మహాసభలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి: హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల పదో మహాసభలకు ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అందిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన ప్రధాని నరేంద్రమోదీ.. ఆ హామీల అమలులో పూర్తిగా విఫలం చెందారన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మనుధర్మ శాస్త్ర అమలుకు కుట్ర పన్నుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిక హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, మర్రి శ్రీనివాస్, కర్రె లక్ష్మణ్, సంతోశ్, రాజ్‌కుమార్, బొంత మల్లయ్య, నిమ్మల మనోహర్, ఉట్కూరి ప్రణీత్, విజయ్, రాజనర్సు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో అనాథ వృద్ధుడి మృతి

- అంత్యక్రియల కోసం వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు
- గంటలో రూ. 51 వేలు జమ చేసిన గ్రామస్తులు



మల్లయ్య మృతదేహం

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన అనాథ వృద్ధుడు ఒడ్డూరి మల్లయ్య (75) వడదెబ్బతో మృతి చెందాడు. మల్లయ్య గతంలో గ్రామంలోని జెంగిడి బర్రెలకు (పాడి గేదెలు) కాపరిగా పని చేసేవాడు. కాలక్రమేణా పాడిగేదెలు తగ్గిపోవడంతో జీవనోపాధి కరువైంది. దీంతో పశువుల ఆస్పత్రి సమీపంలో డేరా వేసుకుని ఒంటరి జీవితం గడుపుతూ గ్రామస్తులు అన్నం పెడితే కడుపునింపుకునేవాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం వడదెబ్బతో చనిపోయినట్లు గ్రామస్తులు గుర్తించారు. మృతుడి అంత్యక్రియలకు ఆర్థిక సాయం చేయాలని తాజా మాజీ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్ ఆ గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయగా గ్రామస్తులు వెనువెంటనే స్పందించారు. దాదాపు గంటలో రూ. 51 వేలు జమ చేశారు. ఆ డబ్బుతో మల్లయ్య దహన సంస్కారాలు పూర్తి చేసి దాతృత్వం చాటారు.

పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తులు



కాళేశ్వరం.. జనసంద్రం



నీళ్లారగిస్తున్న మహిళలు



మొక్కుతున్న యువతి



నది తీరంలో భక్తుల రద్దీ



పుష్కరాలకు వస్తున్న భక్తులు



స్నానం ఆచరిస్తున్న యువతి



స్నానం ఆచరించి మొక్కుతున్న మహిళలు



పిండ ప్రదాన పూజలు చేయిస్తున్న పురోహితులు



స్నానం ఆచరించే ముందు మొక్కుతున్న భక్తులు



నది తీరంలో భక్తుల రద్దీ



వాయినం ఇచ్చి పుచ్చుకుంటున్న మహిళలు



నదిలో ప్రమిదను వదులుతున్న భక్తులు



తీర్థప్రసాదం తీసుకుంటున్న మహిళ



సెల్ఫీ దిగుతున్న యువతులు

అన్నదానం.. మహాప్రసాదం

- పుష్కరాల భక్తులకు పలు ట్రస్ట్‌ల నిత్యాన్నదానం
- పన్నెండు రోజుల పాటు ఉచితంగా టిఫిన్, భోజనం
- భక్తుల ఆకలి తీరుస్తున్న సత్రాలు

కాటారం /మల్హర్: అన్నం పరబ్రహ్మ స్వరూపం. ఆకలితో ఉన్న వారికి ఒక పూట భోజనం పెట్టినా చాలు ఎంతో పుణ్యం లభిస్తుంది. అందుకే సేవాభావంతో పలువురు ప్రముఖ దైవక్షేత్రాల్లో నిత్యాన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అదే మాదిరి ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీనది పుష్కరాల నేపథ్యంలో ముక్తీశ్వరాలయ సమీపంలో దాదాపు 8 చోట్ల అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి అన్నదాతలు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేసి భక్తుల కడుపునింపుతున్నారు. ఒక్క పూటకు నాలుగు నుంచి ఆరు వేల మంది భక్తులకు ఉచిత అన్నదానాలు చేస్తున్నారు.

ప్రతీ రోజు టిఫిన్, అన్నదానం..



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

సరస్వతీనది పుష్కరాల సందర్భంగా ఆర్యవైశ్య, బ్రహ్మణ, ఈశ్వరకుమారి, వాసవీ క్లబ్, ఇతరాత్ర ట్రస్ట్‌ల ద్వారా ఏర్పాటు చేసిన అన్నప్రసాద సత్రాల ద్వారా భక్తులకు ప్రతీ రోజు టిఫిన్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఏదో ఉచిత భోజనం అందిస్తున్నామనే కాకుండా నిర్వాహకులు నాణ్యతతో కూడిన రుచికర భోజనం అందిస్తున్నారు. ఉదయం పలు రకాల అల్పాహారంతోపాటు భోజనంలో రెండు రకాల కూరలు, పప్పు, సాంబారు, పెరుగు, స్వీట్లు, పచ్చడి పెడుతున్నారు. రుచికరం, పరిశుభ్రంగా ఉండడంతో భక్తులు సత్రాల్లో భోజనం చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

భోజన సౌకర్యం బాగుంది..



సరస్వతీనది పుష్కరాలకు రెండు రోజుల క్రితం కుటుంబ సమేతంగా వచ్చాం. అన్నదాన సత్రాల్లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం చేస్తున్నాం. చాలా రుచిగా, శుభ్రంగా ఉంది.

– అనురాధ, భక్తురాలు, మంచిర్యాల

సేవలు అభినందనీయం..



పుష్కరాలకు పిల్లలతో కలిసి చాలా దూరం నుంచి వచ్చాం. మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇబ్బంది అవుతుందని ఆందోళన చెందాం. కానీ తీరా ఇక్కడికి వచ్చి చూస్తే అన్నదాన సత్రాల్లో భోజనం లభించింది. సమయానికి మా ఆకలి తీరింది. అన్నదానం నిర్వాహకుల సేవలు అభినందనీయం.

– శ్రీనివాస్, భక్తుడు, కరీంనగర్

19 సంవత్సరాలుగా అన్నదానం..

కాళేశ్వరం వచ్చే భక్తులకు భోజన సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో మా తండ్రి గుడాల కృష్ణమూర్తి 2007లో కాళేశ్వర ముక్తీశ్వర శ్రీ వాసవి అన్నపూర్ణ నిత్యాన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. 19 సంవత్సరాలుగా ప్రతీ పుష్కరానికి భోజన సౌకర్యం కల్పిస్తున్నాం. మిగతా రోజుల్లో అనేక మంది కాళేశ్వరం వచ్చే ఆర్యవైశ్య భక్తులకు భోజనం అందజేస్తున్నాం. ప్రతీ రోజు భోజనం అందించడం ఆనందంగా ఉంది.

– జానకీమణికుమార్, సత్రం నిర్వాహకురాలు

ఆనందంగా ఉంది..



కాళేశ్వరం వచ్చే భక్తులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉంది. 2015లో గోదావరి పుష్కరాల్లో, 2022 ప్రాణహిత పుష్కరాల్లో కూడా 12 రోజుల పాటు కాళేశ్వరంలో అన్నదానం చేశాం. 12వ పుష్కరం సరస్వతీనది పుష్కరాలకు కూడా అన్నదానం చేస్తున్నాం. భక్తుల కడుపు నింపడం మాకు ఆనందంగా ఉంది.

– సోమ వెంకటయ్య,అన్నదాన, నిర్వాహకుడు

ప్రముఖుల పుష్కర స్నానం..



సరస్వతీనదిలో పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి దంపతులు



సరస్వతి ఆలయంలో పూజలు చేస్తున్న సినీనటుడు రాజేంద్రప్రసాద్

కాటారం/కాళేశ్వరం: పవిత్ర పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా ఆదివారం పలువురు ప్రముఖులు పుష్కర స్నానం ఆచరించారు. హైకోర్టు జడ్జి సుధా దంపతులు, ప్రముఖ సినీనటుడు రాజేంద్ర ప్రసాద్, జెన్‌కో డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్ అనురాధ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న.. సరస్వతి(వీఐపీ)ఘాట్‌లో పుష్కర స్నానం చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం చేరుకుని స్వామి వారికి, సరస్వతీమాతా, శుభానందాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు హైకోర్టు జడ్జి సుధాకు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే స్వాగతం పలికి మొక్కను బహూకరించారు.

నిఘా నీడలో కాళేశ్వరం



కంట్రోల్ రూంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతీనది పుష్కరాల సందర్భంగా పోలీసులు ముందస్తు నిఘా నేత్రాలు ఏర్పాటు చేశారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతం, మహారాష్ట్ర- తెలంగాణ సరిహద్దులో కాళేశ్వరం ఉండడంతో అంతర్రాష్ట్ర వంతెన నుంచి మొదలు.. శ్రీకాళేశ్వర ముక్తీశ్వర దేవాలయం, పరిసర ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలు, పుష్కర ఘాట్, ప్రధాన రహదారుల్లో సుమారు 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటన్నింటినీ కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేసి నిత్యం పరిశీలిస్తున్నారు. ఫలితంగా ఇప్పటి వరకైతే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు.

ఎండవేడితో భక్తుల అస్వస్థత



వీఐపీ ఘాట్ వద్ద అస్వస్థతకు గురైన భక్తుడిని తరలిస్తున్న సింగరేణి రెస్క్యూ సిబ్బంది

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరంలో ఎండ వేడితో భక్తులు అస్వస్థతకు గురవుతున్నారు. పుష్కరాలో భాగంగా నాలుగో రోజు ఆదివారం 8 మంది భక్తులు ఎండవేడికి అస్వస్థతకు గురికాగా 108లో కాళేశ్వరం పీహెచ్‌సీకి తరలించారు. పీహెచ్‌సీలో ఆదివారం 156 మందికి ఓపీ పరీక్షలు నిర్వహించగా 30 మంది భక్తులను అడ్మిట్ చేసుకున్నారు. కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన క్యాంపుల ద్వారా సుమారు 4వేల మంది భక్తులకు వైద్య సేవలు అందించామని డీఎంహెచ్‌ఓ మధుసూదన్ తెలిపారు.

కలెక్టర్ జాయ్ రైడ్..



జాయ్ రైడ్‌కు వెళ్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ జాయ్ రైడ్ చేసి సరస్వతీనది పుష్కర సదుపాయాలను పరిశీలించారు. ఆదివారం ఉదయం కరీంనగర్ సీపీ గౌస్ అలం, కరీంనగర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి హెలికాప్టర్‌లో పుష్కర పరిసరాలు పరిశీలించారు. పుష్కర ఘాట్‌లు, రహదారి సదుపాయాలు, శానిటేషన్, పారిశుద్ధ్య చర్యలు, టెంట్ సిటీ, స్టాళ్లు, భద్రతా ఏర్పాట్లును పరిశీలించారు. అనంతరం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు హెలికాప్టర్ ద్వారా త్రివేణి సంగమం, కాళేశ్వర దేవస్థానం, కాళేశ్వరం చుట్టు పక్కల అడవులు, తదితర అందాలను వీక్షించడానికి జాయ్ రైడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ రాక

భూపాలపల్లి: సరస్వతీనది పుష్కరాలకు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సోమవారం రోడ్డు మార్గాన కాళేశ్వరం రానున్నారు. ఉదయం 10.30 గంటలకు కాళేశ్వరం చేరుకుని పుష్కర స్నానం ఆచరించిన అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుంటారు. 12 గంటలకు తిరిగి కరీంనగర్‌కు వెళ్లనున్నారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కూడా సోమవారం కాళేశ్వరం రానున్నట్లు సమాచారం.

24న రైతు చర్చా వేదిక



మాట్లాడుతున్న ఐలవేణి శ్రీనివాస్

భూపాలపల్లి రూరల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్ హౌస్‌లో నేషనల్ హ్యూమన్‌రైట్స్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఎన్జీఓ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన రైతు చర్చా వేదిక నిర్వహించనున్నట్లు ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఎన్జీఓ జాతీయ అధ్యక్షుడు ఐలవేణి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవన్‌లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడు సురేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఐలవేణి శ్రీనివాస్‌తోపాటు రాష్ట్ర అధ్యక్షుడు నక్క గంగారాం ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. చర్చా వేదికకు విశిష్ట అతిథిగా సీబీఐ జాయింట్ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ రానున్నారని తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని, వ్యవసాయ అనుబంధ రంగాల సంబంధించిన అధికారులు, మేధావులు కూడా పాల్గొంటారని చెప్పారు.

ముగిసిన నెట్‌బాల్ పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం

జనగామ: జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి 8వ సబ్ జూనియర్ బాల బాలికల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి 620 మంది బాలురు, బాలికా క్రీడాకారులు హాజరయ్యారు. ట్రెడిషినల్, ఫాస్ట్‌-5, మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. ట్రెడిషినల్, ఫాస్ట్‌-5 పోటీలు ఈనెల 17న ముగియగా.. చివరగా మిక్స్‌డ్ డబుల్స్ పోటీలతో ముగింపు పలికారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో మహబూబ్‌నగర్ (విన్నర్), కామారెడ్డి(రన్నర్), థర్డ్ ప్లేస్‌లో వరంగల్/నాగర్ కర్నూల్ సంయుక్త విజేతలుగా నిలువగా, మూడు కేటగిరీల్లో విజయం సాధించిన టీంలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.

ఉద్యమ జీవి నల్లెల రాజయ్య

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంపశయ్యనవీన్, తదితరులు

విద్యారణ్యపురి: ఉద్యమ జీవి నల్లెల రాజయ్య చిరస్మరణీయుడని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్ అన్నారు. ఆదివారం హనుమకొండ ప్రాక్టీసింగ్ ప్రైమరీ స్కూల్‌లో నిర్వహించిన 'ప్రజల మనిషి నల్లెల రాజయ్య' పుస్తకాన్ని ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించి మాట్లాడారు. సి. చంద్ర ప్రధాన సంపాదకుడిగా, అనిశెట్టి రజిత, డాక్టర్ కెబి. చంద్రభాను, బిల్ల మహేందర్, పిట్ట సాంబయ్య, రౌతు అజయ్‌కుమార్ సంపాదక వర్గం సభ్యుల ఆధ్వర్యంలో వ్యాసాల సంపుటి(పుస్తకం)ని రూపొందించారు. కేయూ రిటైర్డ్ ఆచార్యుడు బన్నఅయిలయ్య,ప్రముఖ కవి వీఆర్ విద్యార్థి, టీపీఎఫ్ కన్వీనర్ రమాదేవి మాట్లాడారు. కవి కోడం కుమారస్వామి పుస్తకాన్ని సమీక్షించారు. వరంగల్ రచయితల సంఘం కార్యదర్శి దండ్రె రాజమౌళి, వివిధ ప్రజాసంఘాల బాధ్యులు భిక్షపతి, తిరుపతయ్య, సాంబయ్య, ఉదయ్‌సింగ్, మెట్టురవీందర్, జీడి. సారయ్య, మార్కశంకర్‌నారాయణ, కె. శంకర్‌రావు, వి. దిలీప్, బండారు సుజాత, బోనగిరి రాములు, ఎ. విద్యాదేవి, రాజేంద్రప్రసాద్, కుటుంబీకులు సుగుణ, వెన్నెల, సూర్య పాల్గొన్నారు.